తండ్రి తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని అనుకున్న ఆమెకు తెలిసిన నిజం?

# నన్ను క్షమించవూ

ఆరె
పద్మజాచౌదరి
కథ

దబదబ తలుపుమీద చప్పుడు అయ్యింది. ఆ తీరే చెప్తోంది వచ్చిందెవరో. అప్పటికే ఆడ పిల్లలిద్దరూ తమ గదిలో పడుకున్నారు. గదిలో లైటు వెలుగుతోంది కాబట్టి ఇంకా నిద్రపోలేదని అర్థం. మగపిల్లవాడు తన గదిలో పడుకున్నాడు. అతడెప్పుడో నిద్రపోతే గౌరీదేవి వెళ్ళి దుప్పటి కప్పి, లైటు తీసి వచ్చింది.

ఇక మిగిలింది ఇంటి ఇల్లాలు. ఆమెకు తెలుసు వచ్చింది తన నాథుడేనని. లేచి కూర్చుని, కూతుళ్ళ గదికేసి చూస్తోందే తప్ప వెళ్ళి తలుపుతీసే ప్రయత్నం చెయ్యలేదు.

రోజూ జరిగే తంతే అయినప్పటికీ ఏ రోజుకారోజు కొత్తగా, టెన్షన్‌గా ఉంటుంది.

బయటి తలుపు తడుతున్న శబ్దంతోపాటు 'లాలూ తల్లీ' అన్న పిలుపు.

గౌరీదేవి లేచి లాలిత్య కోసం వెళ్ళింది. ఆమె వెళ్ళే సరికి మహిత చదువుకుంటున్న పుస్తకాన్ని గుండెలమీద పెట్టుకొని ఎటో చూస్తోంది. తల్లిని చూడగానే ఆమెలో అంతవరకు చెలరేగుతున్న భావాల తాలూకు అలజడి అధికమయ్యింది. విసురుగా పుస్తకాన్ని తీసి దూకుడుగా టేబిలుమీదకు గిరాటు వేసింది.

మహిత సణుక్కున్న దేమిటో గౌరీదేవికి అస్పష్టంగా ఉన్నప్పటికీ, భావం మాత్రం స్పష్టమేను. ''తెలిసే నేనేం చేయగలను!'' అనుకుంది.

లాలిత్య మంచం దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా ఆమెను తట్టి లేపింది. ''లాలూ...




లేమ్మా... నాన్నగారు వచ్చారు. వెళ్ళి తలుపుతియ్యి'' అంది మృదువుగా.

అంతకే లేచి దిగ్గున కూర్చుంది లాలిత్య ఏ మాత్రం మత్తు లేకుండా అప్పుడే విచ్చుకున్న కలువల్లా ఉన్నాయామె కనులు. కాళ్ళకు చెప్పులు తగిలించుకొని చకచకా వెళ్ళింది. వెళ్తున్న ఆమెవే ఈర్ష్యగా గమనించాయి రెండు కళ్ళు.

ఈ విషయం ఆ తల్లికీ తెలుసు. అయినా ఆమె నిస్సహాయత మెల్లగా మహిత దిశ అడుగులు వేసింది. అప్పటికే మహిత దుప్పటి కప్పేసుకుంది.

''అమ్మా, మహీ...'' అంది. ప్రపంచంలోని అమరాగాన్నంతా రంగరించిన రాగంలో.

''పిచ్చి తల్లీ, ఇప్పుడేమయ్యింది?'' అంది లాలనగా.

''కన్నతండ్రి సవతితల్లి ప్రేమ చూపిస్తుంటే ఏమవుతుంది? ఏమీ కాదు'' విష్టారం.

గౌరీదేవి మౌనం వహించింది. ఆమె మాట్లాడలేదని మహితకు తెలుసు.

ప్రభంజనంలా సుధాకర్, లాలిత్య వచ్చారు. వారి అడుగుల సవ్వడి అల్లంత దూరాన ఉండగానే మహిత ముసుగుతన్నింది.

మెలకువగా ఉన్నదంటే ఏం జరుగుతుందో ఆమెకు తెలుసు. అతడు ఉత్సాహంగా మహితను లేపుతాడు. ''ఏదో తెచ్చాను మీ కోసం... అక్క ఇస్తుంది'' అంటాడు.

అది వినగానే మహిత మోము చిన్నబోతుంది. అయినా తన బాధను తల్లికే తప్ప తండ్రికి తెలియనీయదు. అతడికి లాలిత్య పైన ప్రేమ జాస్తి. ఈ విషయం అతడ్ని ఎరిగిన ప్రతి వ్యక్తికీ తెలుసు. అమ్మలక్కలు అనేకమంది ఈ వాస్తవాన్ని గ్రహించి ఎత్తి చూపటం వల్ల చిన్న కూతురి చిన్ని హృదయం చిన్నబోయిందన్న విషయం అతనికి తెలియదు.

సుధాకర్ ఉదయం నిద్రలేవగానే లాలిత్య ముఖం చూడాలి. ఆమె మాట వినాలి. రాత్రి ఇంటికి వచ్చాక లాలిత్య ఎదురవ్వాలి. ఆమె 'కావాలి' అని అడిగిన ఏ విషయానికీ అతడు 'వద్దు' 'లేదు' అన్న జవాబు ఇవ్వలేదు. రెండు జతల బట్టలు తెస్తే మొదటి ఎంపిక లాలిత్యదే.

ఆఖరి సంతానం మగపిల్లవాడు కాబట్టి, ఎడంగా పుట్టాడు కాబట్టి అతనిలో అసంతృప్తి తల ఎత్తలేదు. పైపెచ్చు అతడు పెద్దక్కకు తండ్రి వద్దనున్న పరపతిని తనకు అనుకూలంగా మలచుకుంటాడు. అతడే కాదు అప్పుడప్పుడు తల్లి కూడానూ.

ఎటొచ్చీ తీవ్రమైన సంఘర్షణకు గురి అయ్యిందీ. ఆ రాపిడికి నలిగిపోయిందీ మహిత ఒక్కతే. చాలాకాలం ఆమె కూడా ఈ విషయాన్ని [illegible] కాని, లోలోన కుమిలిపోయింది. ఈ మధ్య సాధ్యం కావటం లేదు.

** ** **

ఆ రోజు రాత్రి గౌరీదేవి మెదలకుండా ఉండలేకపోయింది. ఏమైనా సరే మహితలో అసంతృప్తి, బాధ ఎక్కువ కాలం ఉండరాదు. అందుకే మెల్లగా భర్తను కదిపింది.

సుధాకర్ అవుననలేదు. కాదనలేదు. మౌనంగా సీలింగ్‌ఫ్యాన్ కేసి చూడసాగాడు. అతని ఆలోచనలు ఎక్కడ చిక్కుకు పోయాయో ఆమెకు అంతు పట్టలేదు. ఈ విషయాన్ని ఎత్తి సంభాషణ జరపాలని ఎప్పుడు ప్రయత్నించినా అది సాగడం లేదు.

కన్నకూతుర్ని తండ్రి ప్రేమించటంలో విడ్డూరం లేదు. కానీ, అతడు ప్రదర్శిస్తున్న ప్రత్యేకత, భేదం ఇట్టే తెలిసిపోతుంది. ఏది ఎలా ఉన్నా ఈ విషయం ప్రస్తావించినప్పుడు అతడు అలా 'ఏదోలా' ఎందుకు అయిపోతాడో ఆమెకు అర్థం కాని విషయం.

ఆమె చెప్పిందంతా విని అతడు తేలిగ్గా కొట్టేశాడు. "అన్నీ నీ అనుమానాలు... మహితను నేను సెకండ్‌గా చూడటం ఏమిటి? అబ్జార్డ్!" అన్నాడు.

"మహితకు ఏడో ఏట జ్వరం వచ్చి ప్రమాదంగా ఉంటే రాత్రింబగళ్ళూ సేవ చేసింది ఎవరు? ఈ చేతులు కాదూ! మళ్ళా ఆడపిల్ల పుట్టిందని వీరా పుట్టింటి వాళ్ళూ, నా తరపు వాళ్ళూ నిందిస్తుంటే, ఆమెను [illegible]టే, ఖండించింది, ఈ తండ్రి హృదయం కాదూ! ఆమెకు మహారాజ్ఞత్వ గౌరవాన్ని కలిగింపచేసింది ఈ కన్నప్రేమ కాదూ! అందరి విషయమూ వదిలెయ్యి. నువ్వూ ఇంతేనా నన్ను అర్థం చేసుకుంది?" అన్నాడు ఉద్వేగంగా.

భార్య ఇక మాటాడలేదు.

ఆమె విడిచిన నిశ్శబ్ద నిట్టూర్పు నిశీధిలో కలిసిపోయింది.

** ** **

ఉదయం అనగా స్నేహితులతో వెళ్ళిన సుధాకర్ మధ్యాహ్నానిగ్గానీ రాలేదు. వస్తూనే ఉషారుగా 'లాలూ' అంటూ వచ్చాడు.

టివి చూస్తున్న లాలిత్య లేచి గబగబా ఎదురెళ్ళింది. ఆమెకన్నా ముందు ఎలర్ట్ అయిన వ్యక్తి మహిత. ఉశ్ఛ్వాస నిశ్వాసలను బిగబట్టి లాలిత్య వెళ్ళిన దిక్కే చూడసాగింది. తండ్రి అంత సంబరంగా పిలిచాడంటే ఏదో అనూహ్యమైనదే తెచ్చి ఉంటాడు.

ఆ తెచ్చేది అక్క కోసమనీ తనకు లభించే భాగం అయాచితమనే ఆమె నమ్మకం. ఎన్నోమార్లు తిరస్కరించాలని ధృఢంగా భావించి కూడా అలా చెయ్యలేకపోయింది.

లాలిత్య... వెనుకే సుధాకర్ వచ్చారు. అతని చేతిలో ఉన్న బుట్టకేసి అందరూ కుతూహలంగా చూశారు. మహిత తప్ప.


"కాంతారావు వాళ్ళ తోటకు తీసుకువెళ్ళాడు. పూలను చూడగానే లాలూకు ఇష్టం అన్నాను. అంతే బుట్టెడు పూలు కోయించాడు. అమ్మా, లాలూ నువ్వు తీసుకొని అమ్మకు, మహితకు ఇవ్వు" అన్నాడు.

లాలిత్య అరచేయంత పచ్చ గులాబీ తీసుకొని మహితను సమీపిస్తుంటే మహిత తృణీకారంగా చూసి, అక్కడి నుండి లేచి వెళ్ళిపోయింది.

తల్లి నిశితంగా గమనించింది.

తండ్రి తెల్లబోయాడు. అతనికి అది ఒక షాక్!

గంభీరంగా, హుందాగా మసలే మహిత ఇలా ప్రవర్తిస్తుందన్నది అనూహ్యం. గౌరీదేవికి మాత్రం తెలుసు. ఇలా ఎప్పుడో జరుగుతుందని. ఇది ఇంట్లో చోటు చేసుకున్న కోల్డ్‌వార్‌కు సూచనేగాని ముగింపు కాదని.



## ఓదార్పు!

"ఇదిగోనే తాడూ, బొంగరం. ఇకమీదట ఇంత చిన్న వాటికే అంత బాధపడకు.

"తాడు బొంగరం లేని బ్రతుకైందని".

ఓదార్చాడు భర్త.

–గోలి శ్రీనివాస్ (తగరపువలస)

ఆ మధ్యాహ్నమంతా మహిత మూడీగా నే ఉంది. ఆ విషయం తెలిసీ తండ్రి ఏమీ చేయలేకపోయాడు. అతనికి తప్పనిసరిగా బిజినెస్ మీద బయటకు వెళ్ళాల్సి వచ్చింది

వెళ్ళిపోతున్న తండ్రిని కిటికీలో నుండి చూచింది మహిత. ''ఈయన మీద నాకే ప్రేమ లేకపోతే, ఇప్పుడు నాకే బాధా ఉండేది కాదుగా'' అనుకుంది.

** ** **

ఆ రాత్రి సుధాకర్ వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. 'లాలూ' అని పిలిస్తే ఎదురొచ్చిన భార్యను చూసి భృకుటి ముడివడింది.

'లాలూకి ఏమయ్యింది?' అన్నాడు కంగారుగా.

'లాలూ బాగానే ఉంది, కానీ...''

'కానీ!' రెట్టించాడు.

'మహీ లేదు'

'లేదా ఎక్కడకు వెళ్ళింది? ఎప్పుడు వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది?'

'ముందు మీరు లోపలకు రండి'

అలసటగా కూలబడిన అతని చేతికే లెటర్ తెచ్చి ఇచ్చింది. వెయ్యి సందేహాలు ఒక్కసారే ముప్పిరిగొనగా అదురుతున్న హృదయంతో చదవసాగాడు.

అమ్మా,

నేను ఇంట్లో ఉండలేకపోతున్నానని నీకూ తెలుసు. ఎందుకో కూడా తెలుసు. అయినా నన్ను సంజాయిషీ అడుగుతావా? నువ్వు అడిగినా, మానినా సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన బాధ్యత నాకుంది.

ప్రతిక్షణం కన్నతండ్రి చేత 'సెకండ్'గా ట్రీట్ చేయబడ్తున్న నా హృదయానికి తెలుసు... అందులో వింత వ్యథ ఉందో! అబద్ధం అనీ, నావి అన్నీ అపోహలనీ కొట్టివేసే ప్రయత్నం చేయకమ్మా. నీకు తెలుసు నిజానిజాలు.

ప్రతిరోజూ అవమానించబడటానికీ, (దీన్ని నేను అవమానమనే అంటున్నాను. ఒక వేళ అది తప్పు అయితే నా ఈ భావానికి సరియైన పదం లేదు) నా మనసును రోజూ కొంచెం కొంచెంగా చిత్రిక బట్టటాన్నీ — ఇక ముందు ఎవ్వర్నీ చేయనివ్వను. నా మనసును, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నాకుంది.

ఏ చిన్న ఉద్యోగం దొరికినా (నాకు మైనార్టీ తీరింది కదా!) చాలు నన్ను నేను పోషించుకుంటాను. ఈ విషయంలో నీకు బాధ కలిగిస్తున్నందుకే నాకు బాధగానూ, సిగ్గుగానూ ఉంది. అయినా తప్పటం లేదు.

నన్ను క్షమిస్తావు కదూ!

నీ

మహిత.

భర్త హృదయం తల్లడిల్లటం ఏ మాత్రం ఇష్టలేక అతడు లెటరు చదవటం పూర్తి చేస్తుండగానే చెప్పింది గౌరీదేవి —

''వేణూని పంపించాను మహీ ఫ్రెండ్సు ఇళ్ళకు, దీపావాళ్ళ ఇంట్లో ఉంది.

సుధాకర్‌కి తక్షణ కర్తవ్యం స్ఫురించగా, 'వేణూని పిలువు' వెళ్తాను అన్నాడు. వేణూతోపాటు గౌరీదేవి కూడా బయలుదేరింది. వెళ్ళబోతున్న పాదాలు లాలిత్య

గది ముందు ఆగాయి.

''లాలూ అన్నాడు' ఆ కంఠంలో అదే లాలిత్యం. ఆ పిలుపులో ఏదో ప్రత్యేకత. ఎక్కడో... ఎవ్వరికీ అర్థంకాని క్షమార్పణ. అది ఈనాటిది కాదు.

అతని పిలుపుకు బదులు రాలేదు.

మామూలుగా లాలిత్య ఈ సమయానికి నిద్రపోతుంది. కానీ, ఈ రాత్రి పోలేదని అతనికి తెలుసు. వెళ్ళి ఆమె మంచం ముందు నిల్చున్నాడు.

నిద్ర పోతున్నట్లు నటించే ప్రయత్నం లో లాలిత్య.

'అమ్మా లాలూ' అన్నాడు అదే మృధువైన కంఠంతో.

పొంగిన గోదావరే అయ్యింది ఆమె వేదన. 'నాన్నా' అంటూ బేలగా రోదించింది. సున్నితంగా ఆమె తల నిమిరాడు.

'నువ్వేం చేశావు తల్లీ? లే... లేచి... తలుపేసుకో. మేం వెళ్ళి మహిని తీసుకొస్తాం' అన్నాడు.

ఆమె తలుపేసుకోవడం చూశాకగానీ వాళ్ళ కారు కదల్లేదు.

మౌనభారాన్ని భరిస్తూ కారు వెళ్ళి దీపావాళ్ళ ఇంటి ముందు ఆగింది. ఆ శబ్దానికి ఆ ఇంటి సింహద్వారం తెరచుకుంది

'రండి... రండి'' మీకోసమే చూస్తున్నాం అన్నాడు రంగనాథం.

సుధాకర్‌తోపాటు వచ్చిన గాంభీర్యం అక్కడి వాతావరణాన్ని అలుముకుంది.

''మహీ, నిద్రపోయిందా?'' అన్నాడు సుధాకర్.

ఆమెకు ఈ రాత్రి నిద్రపట్టదని అందరికీ తెలుసు.

రెండు నిమిషాల్లో మహిత అక్కడకు వచ్చింది. జ్యోతుల్లా ఉన్న కళ్ళతో తండ్రిని సూటిగా చూసి, అతని ఎదురుగా కూర్చుంది. ఆ చూడటంలోనూ, కూర్చోవడంలోనూ స్పష్టమైంది. ఆమె ఈ రాజీకి సిద్ధంగా లేదని పసితనం నుండి కలిగిన మానసిక

## నిద్ర



సగటు మనిషి నిద్రలేకుండా 120 గంటలు మించి వుండలేడు. నిద్రలో 25, 30 సార్లు అటూ యిటూ దొర్లడం జరుగుతుంది.

నిద్రలో సగభాగం సాధారణంగా కలలతో గడిచిపోతుంది. ఒక వ్యక్తి జీవిత కాలంలో మూడింట ఒక వంతు పడకపై వుంటాడు.

వ డాక్టర్ ఆళ్ల

సంఘర్షణ లాలూకు వ్యథతో, ఒత్తిడితో ఆమె హృదయం రాటు తేలిపోయింది.

సుధాకర్ నిశ్శబ్దంగా చాలాసేపు ఆమెనే గమనించాడు. ఆమె మనసునే చదివాడో, ఆ ఎదలోని గాయాన్నే చూశాడో గానీ, చిక్కగా పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ —

"నన్ను మన్నిస్తావా, మహీ" అన్నాడు.

అందరూ ఉలిక్కి పడ్డారు.

మహిత కళ్ళు కలవరాన్ని దాచలేక తల్లడిల్లి పోయాయి.

"ఏ తండ్రికీ ఎదురవ్వకూడని పరిస్థితి నాది. కన్నకూతురికి ఆమె తనకెంత విలువైనదో చెప్పుకోవాల్సి రావడం. ఏ తండ్రికీ రాకూడదు. ఒకే దిశలో నా ఆలోచనలు ప్రయాణించటం వలన నాకెంతో ప్రియమైన నిన్ను కష్టపెట్టాను. ఒట్టి క్షమార్పణలు కోరితే చాలదు. నీకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన బాధ్యత నాకుంది. ముందుగా నేను చెప్పేది విను. నీకు న్యాయం అని తోస్తేనే నన్ను క్షమించు".

అందరూ ఊపిరిబిగబట్టి వినసాగారు.

"మీ అమ్మకు తొలిసారి తొమ్మిది నెలలు నిండే సమయానికి నేను ఆమె పుట్టింటికి చేరుకున్నా మొదటి కాన్పు కావడం వల్ల మాలో చెప్పలేని ఉద్విగ్నత. పైగా అప్పుడు మీ అమ్మ ఆరోగ్యం సరిగాలేదు. బలహీనంగా ఉంది, రక్త హీనతతో బాధ పడ్తూ ఉండేది. చెకప్‌కు తీసుకువెళ్ళి నప్పుడల్లా డాక్టర్ నన్ను చివాట్లు వేసేది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ డెలివరీ కష్టం అయ్యింది. ఆమెను పేరున్న పెద్ద నర్సింగ్ హోంలో చేర్పించాము. నలుగురు నిపుణులైన డాక్టర్లు ఆమె డెలివరీకి అటెండయ్యారు. బయట మేం టెన్షన్‌తో చచ్చిపోతున్నాం. అప్పుడొచ్చింది డాక్టర్ ఝాన్సీ.

చూపులతోనే నన్ను రమ్మని పిలిచింది. తడబడే అడుగులతో వెళ్ళాను. 'ఏమిటని అడగటానిక్కూడా గొంతు పెగల్లేదు. శూన్య దృక్కులతో ఆమె ముందు నిల్చొన్నాను.

"డెలివరీ కష్టంగా ఉంది. తల్లీ, బిడ్డల్లో ఒక్కరు మాత్రమే దక్కుతారు" అంది.

ఆమెను నేను ఆపైన మాట్లాడనివ్వలేదు. "డాక్టర్... గౌరికి బ్రతికించండి, ఆమె లేకపోతే నేను చచ్చిపోతాను" అన్నాను.

ఆమె మీ అమ్మ ప్రాణాలకు హామీ ఇచ్చి, "పాపాయి మీద ఆశ వదులుకోండి" అంది.

"పర్వాలేదు డాక్టర్, గౌరికి బ్రతికించండి" అన్నాను.

గౌరి బ్రతికింది. గౌరితోపాటు పాపాయి దక్కింది. మొదటిసారి ఆ పాపాయిని ఎత్తుకొని గుండెలకు హత్తుకున్నప్పుడు కలిగినప్పటి అనిర్వచనీయమైన ఆనందంలో... ఒక్కసారి కొరడాతో ఝుళిపించినట్లు తత్తరపడ్డాను. ఈ పాప లేకపోయినా పర్వాలేదన్న మాట ఎలా అనగలిగానా అన్న ఆలోచన నన్ను నిలువనీయలేదు. అప్పటి నుండీ, ఈ ఇరవై ఏళ్ళుగా నాలో అదే కలవరం. ఏ క్షణమూ అది నన్ను వదల్లేదు. లాలూను చూసినప్పుడల్లా నన్ను నేను

క్షమించుకోలేను. తండ్రి ఆలోచన పిల్లల మీద పడ్తుందేమోనన్న భయంతో నేను చలించిపోతాను. ఇప్పటికీ, అప్పుడప్పుడు అర్ధరాత్రుళ్ళు లేచి అదే ఆలోచించుకుంటాను. 'హే! భగవాన్! నా ఆయువు కూడా ఇచ్చి నా లాలూని చల్లగా చూడు' అని వేడుకుంటాను.

నన్ను నేను సర్ది చెప్పుకోలేని స్థితిలో, నన్ను నేను క్షమించుకోలేని హృదయంతో నలిగిపోతూ, ఒకప్పటి నా మాట తలపుకు వచ్చి చలించిపోతూ... లాలూమీద ప్రత్యేకత కనబరిస్తే — అది నా ఆత్మమాన్యతా భావానికి చిహ్నమే గానీ, నీకన్నా అక్క మీద ప్రేమ ఎక్కువని కాదు. అది నా అంతంకల్లోలానికి బాహ్యరూపమే తప్ప నా చిన్న కూతుర్ని చిన్న చేయటం కాదు. అప్పుడు తెలియక లాలూకు ద్రోహం తలపెట్టిన ఈ తండ్రి, ఇప్పుడు అదే తెలియని తనంతో, నీకూ కష్టం కలిగించాడమ్మా. నన్ను క్షమించు. నన్ను క్షమించు.

రెండు క్షమార్పణలు ఎందుకో, ఎవరెవరిని ఉద్దేశించినవో అక్కడున్న అందరికీ విదితమే.

ఆ బాధ ఇప్పుడు ఈ కూతురి కోసమే, అప్పటి ఆ కూతురి కోసమో స్పష్టాస్పష్టంగా ఉంది.

ఎన్నో ఏళ్ళుగా గూడుకట్టుకున్న వేదనా భారాన్ని చెప్పుకోవటం ద్వారా అతడు భారాన్ని దించుకున్నాడో లేదో గానీ, అతని బాధ విన్నాక అందరి హృదయాలూ భారమయ్యాయి.

తల వెనక్కి వాల్చి, కళ్ళు మూసుకున్న సుధాకర్ తన కాళ్ళ దగ్గర మహిత స్పర్శకు, ఆమె వెక్కిళ్ళ శబ్దానికి ఉలిక్కిపడి కదిలాడు .

"నన్ను... క్షమించు నాన్నా... ప్లీజ్" అంది మహిత వెక్కుతూ...

